

ప్రతిభా అవార్డులకు ప్రతిపాదనల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 29 జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని 2023 సంవత్సరానికి ప్రతిభా అవార్డులు ప్రదానం చేసేందుకు జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల నుంచి ప్రతిపాదనలను స్వీకరిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి లింగేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పాఠశాలల్లో జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థుల వివరాలను ఈ నెల 16వ తేదీలోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఐదు పాఠశాలలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యాశాఖ 2023 సంవత్సరానికి గాను ప్రతిభా అవార్డులు అందజేస్తుందని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థుల ధ్రువపత్రాలను ధృవీకరించి నిర్ణీత గడువులోగా అందజేయాలని కోరారు.

లీజు పేరిట మోసం

భూమిని చదును చేస్తున్న రైతులు

- రైతుల భూములను రియల్ వ్యాపారులకు ఇచ్చేందుకు యత్నం
- స్వాధీనం చేసుకున్న రైతులు

లీజు పేరిట రైతుల నుంచి భూములు తీసుకొని.. వారిని ఏమార్చి ఆ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెట్టే యత్నాలను రైతులు తిప్పికొట్టారు. విక్రయం గురించి తెలుసుకొని తమ భూములను చదును చేసి రైతులు స్వాధీనం చేసుకున్నారు. రైతులకు ఎపి రైతు సంఘం, సిపిఎం అండగా నిలిచాయి. రైతులకు తిరిగి భూములు ఇప్పించాలని సిపిఎం పోరాటం సాగిస్తోంది.

ప్రజాశక్తి-వేపాడ

వేపాడ మండలంలోని వీలుపర్తి గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్లు 4/60, 5/60లో గల 70 ఎకరాలను రైతుల నుంచి ఐదేళ్ల లీజుకు బోసురాజు అనే వ్యక్తి తీసుకున్నాడు. ఎకరాకు రూ.20 వేలు చొప్పున చెల్లించేందుకు అంగీకారం కుదుర్చుకున్నాడు. సుమారు సుమారు వంద మంది రైతుల నుంచి ఈ విధంగా భూములు తీసుకున్నాడు. లీజు సమయం ముగియడంతో తమ భూములు తమకు ఇచ్చేస్తే సాగు చేసుకుంటామని పలుమార్లు రైతులు అడిగినా బోసురాజు తిరిగి ఇవ్వలేదు. పైగా ఆ భూములను ఇటీవల వేరొక జిల్లా రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెట్టేందుకు గ్రామంలో కొంతమంది దళారులతో కలిసి సర్వే చేయించారు. అనుమానం వచ్చిన రైతులు ఆ భూములను స్వాధీనం చేసుకున్నారు. అందులో ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు. ప్రాణాలు పోయినా భూములను విడిచిపెట్టేది లేదని తెలిపారు. తెల్ల కాగితాలపై తమతో సంతకాలు పెట్టించుకుని తమను మోసం చేసేందుకు బోసురాజుతోపాటు రెవెన్యూ అధికారులు ప్రయత్నిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం నాయకులు చల్లా జగన్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన భూములు అమ్మడానికి, కొనడానికి ఎవరికీ అధికారం లేదని అన్నారు. ప్రభుత్వం కొత్తగా సాగులో ఉన్న భూములపై రైతులకు పూర్తి హక్కు కల్పించి జీవో తీసుకొచ్చిందని తెలిపారు. రైతుల పోరాటానికి అండగా ఉంటామని తెలిపారు.

ఐదేళ్లకే లీజుకిచ్చాం

ప్రభుత్వం ఇచ్చిన డి-పట్టా భూములను బోసు రాజుకు ఐదేళ్లకు లీజుకు ఇచ్చాం. ఆ సమయంలో మాతో తెల్ల కాగితంపై సంతకం పెట్టించుకున్నారు. ఐదేళ్లు దాటిపోయినా భూములు మాకు ఇవ్వకుండా రక రకాల కారణాలు చెబుతూ కాలయాపన చేస్తున్నారు. కొంతమందిని తీసుకొచ్చి ఇక్కడ సర్వే చేయించడంతో అనుమానం వచ్చి మా భూములను మేము చదును చేసుకుంటున్నాం. మా భూముల్లోకి ఎవరు వచ్చినా ఒప్పుకునేది లేదు.

- గోకాడ భూషణం

లీజు ఇవ్వకుండా మోసం

మా భూములు తీసుకొని లీజు సమయం ముగిసి రెండేళ్లు దాటినా ఇప్పటికీ లీజు డబ్బులు ఇవ్వకుండా తిప్పుతున్నారు. మేము లీజుకు ఇచ్చిన భూములను ఇతర జిల్లా రియల్ ఎస్టేట్ వ్యాపారులతో సర్వే చేయించడం మాకు అనుమానం కలిగి మా పేరును గల భూములను బాగు చేసుకుంటున్నాం. మా భూములను ఇతరులకు ఇచ్చే ప్రసక్తే లేదు.

- గోకాడ సరస్వతి

మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయం

జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు • 5,06,937 మందికి రూ.61.20 కోట్ల సున్నా వడ్డీ జమ

ప్రజాశక్తి-విజయనగరం

మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి మహిళల కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం జరిగిన సున్నా వడ్డీ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మహిళా సంఘాలకు చెక్కును అందజేశారు. నవరత్నాలలో భాగంగా మహిళలకు నాలుగో విడత సున్నా వడ్డీ విడుదల చేశారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో బటన్ నొక్కి, విజయనగరం జిల్లాలోని 45,060 మహిళా సంఘాలకు చెందిన సుమారు 5,06,937 మందికి రూ.61.20 కోట్లను వారి బ్యాంక్ ఖాతాల్లో ముఖ్యమంత్రి జమ చేశారు. జిల్లా నుంచి వీడియో కాన్ఫరెన్సులో జెడ్‌పి ఛైర్మన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ మహిళలను రుణవిముక్తుల్ని చేస్తూ, వారికి ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ పథకాన్ని అమలు చేయడమే కాకుండా, వారు చెల్లించిన వడ్డీని తిరిగి చెల్లిస్తూ, వైఎస్ఆర్ సున్నా వడ్డీ పథకాన్ని ప్రతిఏటా అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ డబ్బుతో మహిళలు చిన్నచిన్న స్వయం ఉపాధి యూనిట్లను ఏర్పాటు చేసుకొని, ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇంఛార్జి కలెక్టర్ మయూర్ అశోక్, ఎమ్మెల్సీలు డాక్టర్ పి.సురేష్ బాబు, ఇందుకూరి రఘురాజు, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయా యాదవ్, డిఆర్‌డిఎ పీడీ ఎ.కళ్యాణ చక్రవర్తి, మెప్మా పీడీ సుధాకర రావు, జిల్లా సమాఖ్య ప్రతినిధులు, వైకెపి అధికారులు, డ్వాక్రా మహిళలు పాల్గొని, ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించారు.

చెక్కు అందజేస్తున్న జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జి కలెక్టర్ మయూర్ అశోక్

ఎండిఎం కార్మికులను తొలగించడం అన్యాయం

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

రాజకీయ కారణాలతో మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించడం అన్యాయమని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు ఖండించారు. స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యాన శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలజంగి గ్రామంలో 16 ఏళ్లుగా ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులుగా పనిచేస్తున్న పొట్నూరు సత్యవతిని అన్యాయంగా తొలగించారని తెలిపారు. ఆమెను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచాలని కోరారు. నిర్వాహకులకు కనీస వేతనం అమలు చేయాలన్నారు. అనంతరం ఎంఇఒ సిహెచ్.లక్ష్మణరావుకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు డి.రామలక్ష్మి, ఆదిలక్ష్మి, లలిత, సత్యవతి పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, సిఐటియు నాయకులు

మహాశక్తి కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు సంధ్యారాణి, తదితరులు

మహిళలకు అండ ఉంటాం

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సంధ్యారాణి

ప్రజాశక్తి-మెంటాడ

టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్ మహిళలకు ఆస్తిహక్కు, డ్వాక్రా మహిళలకు రుణాలు, ఉచిత గ్యాస్ నుంచి మహాశక్తి వరకు టిడిపి మాత్రమే మహిళలకు అండగా నిలిచిందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం మెంటాడలో మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. మహాశక్తి ప్రణాళికలో ఒక్కో కుటుంబానికి సుమారు లక్షా ఇరవై వేలు ఆదాయం వచ్చినట్లు పథకాలు రూపొందించా మన్నారు. సైకిల్‌కు రెండు చక్రాలలో ఒకటి అభివృద్ధి, రెండోది సంక్షేమమని అన్నారు. చంద్రబాబు ప్రాజెక్టుల సందర్శన, లోకేష్ యువగళం యాత్రలకు ప్రజల ఆదరణ చూసి వైసిపి నేతలకు నిద్రపట్టడం లేదన్నారు. వైసిపి ప్రభుత్వాన్ని గద్దిదించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చలుమూరి వెంకట రావు, గెద్ద అన్నవరం, రెడ్డి ఎర్నాయుడు, ప్రవీణ్ కుమార్, ఎస్.గురు నాయుడు, ముసలి నాయుడు, రామలింగేశ్వర రావు,పల్లి సింహాద్రి, జి.కాశీ విశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు.

ఫాస్ట్ ఫుడ్ వద్దు.. పోర్టిఫైడే ముద్దు

జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాసరావు • పోర్టిఫైడ్ బియ్యంతో చేసిన వంటకాల ప్రదర్శన

ప్రజాశక్తి-విజయనగరం

పోర్టిఫైడ్ బియ్యాన్ని తయారు చేయడం పెద్ద ప్రక్రియని, అయినప్పటికీ మహిళల, పిల్లల ఆరోగ్యం కోసం ప్రభుత్వం కోట్ల రూపాయలను ఖర్చు చేసి ప్రజా పంపిణీ ద్వారా ఉచితంగా పోర్టిఫైడ్ బియ్యం సరఫరా చేస్తోందని జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ మజ్జి శ్రీనివాస రావు తెలిపారు. ఈ బియ్యాన్ని ప్రజలంతా తప్పకుండా వినియోగించాలని అన్నారు. పౌర సరఫరాలశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రెవిన్యూ హోంలో పోర్టిఫైడ్ బియ్యంతో చేసిన వంటకాల ప్రదర్శన నిర్వహించారు. జిల్లా నలు మూలల నుండి 104 స్టాల్స్ లో మహిళలు పోర్టిఫైడ్ బియ్యంతో చేసిన పలురకాల సాంప్రదాయ వంటకాలను ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా హాజరైన జెడ్‌పి ఛైర్మన్ మాట్లాడుతూ ఇలాంటి పోటీలు ప్రతి గ్రామం లోను నిర్వహించాలని, పోర్టిఫైడ్ బియ్యంపై ప్రజలందరికీ అవగాహన కలగాలని తెలిపారు. ప్రజా పంపిణీ ద్వారా సరఫరా అవుతున్న బియ్యాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించి నప్పుడే ఈ బియ్యం పక్కదారి పట్టవని అన్నారు. ఇన్‌ఛార్జి కలెక్టర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ పోర్టిఫైడ్ బియ్యంలోనే విటమిన్లు, ఖనిజాలు ఉంటాయని, ఈ బియ్యం వాడిన వారికి బలం కోసం వేరే మందులు వాడనవసరం ఉండదని తెలిపారు. జిల్లాలో రక్త హీనత అధికంగా ఉన్న నేపథ్యం లో మన జిల్లాలోనే మొదటిసారిగా ఈ బియ్యాన్ని పిడిఎస్ ద్వారా సరఫరా చేయడం జరిగిందని, ప్రస్తుతం ఉచితంగా అందజేస్తున్నామని అన్నారు. మేయర్ వి.విజయలక్ష్మి మాట్లాడుతూ ఇదే బియ్యాన్ని పాలిష్ పెట్టి బయట అధిక ధరలకు అమ్ముతున్నారని, సన్న బియ్యం అని ఎక్కువ ధర పెట్టి బలం లేని బియ్యాన్ని తింటున్నారని తెలుసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ ఛైర్పర్సన్ డాక్టర్ భావన, డిప్యూటీ మేయర్ లయ యాదవ్, ఎఎంసి ఛైర్పర్సన్ భార్గవి ప్రసంగించారు. డిఎస్ఒ మధుసూదన్ రావు, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ మీనా కుమారి, మెప్మా పీడీ సుధాకర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు. పోటీలలో గెలుపొందిన వారికి అతిథుల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.

పోర్టిఫైడ్ బియ్యంతో చేసిన వంటకాలను పరిశీలిస్తున్న జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

డిప్యూటీ స్పీకర్‌కు సిఐటియు వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఇసుక పాలసీ, కరోనా మహమ్మారి కారణంగా భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకుండా పోయాయని, ఆర్థిక ఇబ్బందులతో కార్మికులు ఆత్మహత్యలు చేసుకోవలసిన దుస్థితి ఏర్పడిందని, ఈనేపథ్యంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామిని సిఐటియు నాయకులు కోరారు. శుక్రవారం ఈమేరకు ఆయనను కలిసి సిఐటియు నగర కార్యదర్శి ఎ.జగన్మోహన్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కంది త్రినాధ్ వినతి అందజేశారు. భవన నిర్మాణ కార్మికులకు పనిలేని కాలానికి దరఖాస్తు చేసిన ప్రతి కార్మికునికి నెలకు రూ.10వేలు జీవన భృతి ఇవ్వాలని, పెండింగ్ క్లైములు చెల్లించాలని, కరోనా సమయంలో నమోదు చేసిన బిల్డింగ్ వర్కర్ల కార్డులు మంజూరు చేయాలని, పెన్షన్ ఇవ్వాలని , కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పైడి నాయుడు, కృష్ణారావు, అప్పారావు, ఇర్ని బాబు, చిన్న, రాంబాబు, వాసు తదితరులు పాల్గొన్నారు.

స్థానికులతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

25వ డివిజన్‌లో గడపగడపకూ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 25వ డివిజన్ కన్యకా పరమేశ్వరి ఆలయం నుండి ప్రారంభమైన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అందిస్తున్న పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారుల వివరాలతో కూడిన బుక్లెట్లను అందించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలన తీరు పట్ల ప్రజల స్పందనను అడిగి తెలుసుకున్నారు. మంగళ వీధి ప్రాంతంలో అధికారులతో కలియతిరిగి అక్కడ ఏర్పాటు చేసిన ప్రధాన కాలువ పరిస్థితిని పరిశీలించారు. వర్షం కురిసే సమయంలో వ్యాపారస్తులకు ఇబ్బంది లేకుండా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అందరూ సంతప్తి వ్యక్తం చేయడంతో ఆనందంగా గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం సాగింది. 19వ డివిజన్ లంకపట్నం రామ మందిరం నుండి ప్రారంభమైన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జోనల్ ఇన్చార్జిలు కోలగట్ల కృష్ణారావు బంగారు నాయుడు పాల్గొన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చులయ యాదవ్, వైసీపీ నాయకులు పొట్నూరు శ్రీనివాసరావు, లంక వరలక్ష్మి, యడ్ల రాజేష్, బోడసింగి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి-రామభద్రపురం

తమ సమస్యల పరిష్కారం కోసం ఎపిటిఎఫ్ ఆధ్వర్యాన శుక్రవారం నాయుడువలస ప్రాథమికోన్నత పాఠశాల వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎపిటిఎఫ్ మండల అధ్యక్షులు బి.రవికుమార్ మాట్లాడుతూ ఉద్యోగోన్నతులిచ్చి రెండు నెలలైనా ఇంతవరకు జీతాలు ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. సుమారు 60 వేల మంది ఉపాధ్యాయులకు కావాలనే ప్రభుత్వం జీతాల చెల్లింపు విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తోందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడటం ప్రభుత్వ బాధ్యతని, తక్షణమే ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జెసి రాజు, రెడ్డి వేణు, శేఖర్, శివున్నాయుడు, కృష్ణంనాయుడు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని 26, 28, 29వ వార్డుల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.19.50 లక్షలతో మూడు వార్డులలో రోడ్లు, కాలువల పనులు చేపడుతున్నామని చెప్పారు. అనంతరం స్వామివారివీధిలో ఉన్న శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వంతో అభివృద్ధి

బొబ్బిలిరూరల్ : వైసిపి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం, సాధ్యమని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని ఎం.బూర్జవలస గ్రామంలో 40 లక్షల రూపాయలతో గ్రామ సచివాలయం, 21 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి శంబంగి లక్ష్మి, వేణుగోపాలనాయుడు, వైస్ ఎంపిపి అరసాడ శంకర్రావు, ఎంపిటిసి జి.దేవి, నాయకులు గుణుపూరు శ్రీను, యడ్ల అప్పారావు, ఎంపిడిఒ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కకు నీరు పోస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు

బాల్య వివాహాలకు ముగింపు పలకాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

అనాదిగా బాల్య వివాహాలు కొనసాగుతున్నాయని, ఇకనైనా వాటికి ముగింపు పలకాలని సామాజిక, పరివర్తన మార్పు సమాచార వ్యవస్థ జిల్లా సమన్వయ అధికారి బి.రామకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం నెల్లిమర్ల మండలంలోని కొండవెలగాడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, రక్తహీనత, పౌష్టికాహారం, జంక్ ఫుడ్ వల్ల కలిగే ప్రమాదాలు, కెరీర్ గైడెన్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల పేదరిక విషవలయంలో చిక్కుకొంటున్నారని, అనారోగ్యాలతో మరణాలు సంభవిస్తున్నాయని వివరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే 112 నంబరుకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం కెవిఎన్ లక్ష్మి, ఉపాధ్యాయులు ఎం.కిశోర్, పి.వి.రమణ, పి.శ్రీను పాల్గొన్నారు.

సచివాలయంలో తనిఖీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 10వ నెంబర్ సచివాలయాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్ శ్రీరాములునాయుడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం 10, 34 సచివాలయాల పరిధిలోని బూత్ లెవెల్ అధికారుల ఇంటింటి ఓటరు జాబితా పరిశీలన సర్వేపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. శతశాతం ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. బూత్ లెవెల్ అధికారులు పూర్తి పారదర్శకంగా ప్రతి ఇంటికీ వెళ్లి అవసరమైన మార్పులు చేర్పులు చేసే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ ప్రక్రియలో వాలంటీర్లు ప్రమేయం లేకుండా చూడాలన్నారు. బూత్ లెవెల్ అసిస్టెంట్లను అనుసంధానం చేసుకొని ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

కాంగ్రెస్‌తోనే ప్రజలకు న్యాయం

ప్రజాశక్తి-బొబ్బిలి

కాంగ్రెసుతో ప్రజలకు సంపూర్ణ న్యాయం జరుగుతుందని పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని మీగడవీధిలో శుక్రవారం రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుద్దాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కాంగ్రెసును గెలిపించాలని కోరారు. కేంద్రంలో కాంగ్రెసును గెలిపిస్తే రూ.500కే గ్యాస్ ఇస్తామని చెప్పారు.

పోక్సో కేసులో ముద్దాయికి 20 ఏళ్లు జైలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

వావి, వరుస మర్చి, అభమూ శుభం తెలియని కన్న కూతురితోపాటు, ఆమె స్నేహితురాలిపై కూడా అత్యాచారానికి పాల్పడిన కామాంధుడికి శుక్రవారం జిల్లా కోర్టు 20ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు జరిమానా విధించింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ విక్రాంత్ పాటిల్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. పార్వతీపురం పట్టణం కొత్తవలసకు చెందిన రొంపిల్లి రామకృష్ణ గత ఏడాది జూలైలో తల్లిలేని నాలుగో తరగతి చదువుతున్న తన కుమార్తెపై అత్యాచారానికి పాల్పడడమే కాకుండా, వారం రోజుల తర్వాత ఆమెకు తోడుగా వచ్చిన స్నేహితురాలిపై కూడా అత్యాచారానికి పాల్పడ్డాడు. అంతేకాకుండా ప్రతిఘటించిన వీరిపై ఎవరికీ చెప్పొద్దని, చెబితే కొడతానని బెదిరించాడు. ఆ తర్వాత విషయం బయటకుపొక్కడంతో ఇరువురు బాలికలు పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టంతో పాటు వేర్వేరుగా రెండు కేసులు నమోదు చేశారు. ఈ రెండు కేసులకు అప్పటి డిఎస్‌పి ఎ.సుభాష్ దర్యాప్తు అధికారిగా, దిశ సెల్ డిఎస్పీ ఎస్ఆర్ హర్షిత ట్రయల్ పర్యవేక్షణ నిర్వహించారు.

వీరివురు కృషితో ఏడాది కాలంలో ముద్దాయికి శిక్ష వేయించగలిగారు. ముద్దాయిపై నేరం రుజువుకావడంతో శుక్రవారం పోక్సోకోర్టు జిల్లా జడ్జి షేక్‌సికింద‌ర్‌బాషా ఒక్కో కేసులో ముద్దాయికి 20ఏళ్లు కఠిన కారాగారా శిక్ష, రూ.10వేలు జరిమాన విధించారు. బాధిత బాలికలు ఒక్కొక్కరికి రూ.4లక్షలు చొప్పున నష్టపరిహారం మంజూరు చేస్తూ తీర్పు అందించారు. ఈ కేసులో చొరవ చూపించిన పోలీస్ సిబ్బంది ఐ.వెంకటరమణ, కె.అప్పలరాజు, ఎం.హరికృష్ణ, రాధను ఎస్పి అభినందించారు. విలేకరుల సమావేశంలో ఎఎస్పీ దిలీప్‌కుమార్, దిశా డిఎస్పీ హర్షితలత పాల్గొన్నారు.

టయోటా రూమియన్ కారు విడుదల

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని టయోటా షోరూంలో టయోటా కిర్లోస్కర్ మోటారు పూర్తి సరికొత్త టయోటా రూమిన్ కారును విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. వర్చువల్ సమావేశం ద్వారా దీన్ని విడుదల చేశారు. టయోటా కిర్లోస్కర్ మోటర్ మేనేజింగ్ డైరెక్టర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మసకాజు యోషిమురా మాట్లాడుతూ ఇది ఆకర్షణీయమైన, ప్రీమియం కొత్త ఫ్యామిలీ కార్‌లో సాటిలేని స్థలం, అద్భుతమైన ఇంధన సామర్థ్యంతో గొప్పగా చెప్పుకునే కొత్త కాంపాక్ట్ ఎంపివిగా నిలుస్తుందని అన్నారు. ఇప్పటికే భారతీయ ఎమ్‌పివి విభాగంలో ముందంజలో ఉన్న ఈ సెవెన్-సీటర్ ఆవిష్కరణ మార్కెట్లో టయోటా ఉనికిని మరింత పెంచుతుందని భావిస్తున్నామన్నారు. పూర్తి సరికొత్త టొయోటా రూమియన్‌లో నియో డ్రైవ్ టెక్నాలజీ, ఈ-సిఎన్‌జి టెక్నాలజీతో కూడిన శక్తివంతమైన కె సిరీస్ 1.5-లీటర్ పెట్రోల్ ఇంజన్ వుందని తెలిపారు. టయోటాలో, మేము ప్రపంచ స్థాయి వాహనాలను డెలివరీ చేయడంలో ముందుకు వెళ్తున్నామని నమ్ముతున్నామని అన్నారు.

అర్ధాంతరంగా నిలిచిన కాలువను చూపిస్తున్న టిడిపి నాయకులు

టిడిపి సెల్ఫీ ఛాలెంజ్

ప్రజాశక్తి - పూసపాటి రేగ

మండలంలోని కుమిలి గ్రామం వద్ద తారకరామ తీర్థ సాగర్ ప్రాజెక్టు కాలువ పనులు గత ప్రభుత్వ హయాంలో ఎంతవరకు చేశారో నేటికీ అలానే ఉన్నాయని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. ఈ మేరకు శుక్రవారం కాలువ వద్ద సెల్ఫీ ఛాలెంజ్ చేశారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ శంకుస్థాపనకు వచ్చిన సిఎం జగన్ రెడ్డి రిజర్వాయర్ పనులు పూర్తి చేస్తానని హామీ ఇచ్చినా ఇప్పటికీ పనులు ముందుకు కదల్లేదని ఆయన ఆక్షేపించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మహంతి శంకరరావు, చింతపల్లి శ్రీను, చెల్లుబోయిన దుర్గారావు పాల్గొన్నారు.

సున్నా వడ్డీ రూ.2.20 కోట్లు జమ

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలో 1378 డ్వాక్రా సంఘాల మహిళలకు రూ.2.20 కోట్లు సున్నా వడ్డీ నిధులు జమైనట్లు ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు తెలిపారు. మోపాడ ఆర్‌బికెలో సిఎం జగన్ కార్యక్రమాన్ని వర్చువల్‌గా వీక్షించారు. కార్యక్రమంలో సర్పంచులు బడుకొండ రమేష్‌నాయుడు, సరగడ బంగారు రెడ్డి, పోరోతి త్రిమూర్తులు పాల్గొన్నారు. డెంకాడ సచివాలయంలో పిఎసిఎస్ చైర్మన్ రొంగలి కనక సింహాచలం, సర్పంచ్ పతివాడ గౌరీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. కార్యక్రమంలో ఎపిఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు నగదు బహుమతి

ప్రజాశక్తి-బాడంగి

పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాడంగి హైస్కూల్ విద్యార్థులకు నగదు బహుమతి అందజేయాలని జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు.. హెచ్‌ఎం దత్తి సత్యనారాయణకు శుక్రవారం రూ.10,500 అందజేశారు. జెడ్‌పిటిసి రామారావు తన తండ్రి, మాజీ సర్పంచ్ సింహాచలం జ్ఞాపకార్థం పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ఇక్కడ చదివి ఉన్నత స్థాయిలో ఉన్నవారు, దాతలు సహకరించాలని కోరారు. జెడ్‌పిటిసి రామారావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఈశ్వరరావు, త్రినాథ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వివేకానంద బోధనలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

వివేకానంద బోధనలు స్ఫూర్తిదాయకంగా నిలిచాయని రామకృష్ణ మిషన్ ప్రతినిధి స్వసంవేద్యానంద అన్నారు. శుక్రవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చదువు మార్కుల కోసం కాదని, జ్ఞాన సంపద కోసమని గ్రహించాలన్నారు. విద్య విలువలను నేర్పుతుందని, మన జీవన విధానం అక్షరాస్యతను తెలుపుతుందని వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, ఐక్యూఎసి డీన్ పిఎస్‌వి రమణారావు, పారా మెడికల్ డీన్ ఎం.ఎల్.ఎన్. ఆచార్యులు, నూకరాజు, నాగజోగయ్య, బెనర్జీ పాల్గొన్నారు.



రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

రేషన్ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

బొడ్డవర సచివాలయంలో 70 మందికి మంజూరైన కొత్త రేషన్ కార్డులను ఎమ్మెల్సీ రఘురాజు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ జగనన్న పాలన రామరాజ్యాన్ని తలపిస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ వైసిపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి సోమేశ్వరరావు, వైస్‌ఎంపిపి సుధారాజు, సర్పంచ్ మీనా, నాయకులు మురళీరాజు, దేముడు, కేత వీరన్న, సత్యనారాయణ, చల్లా రాము, వల్లభరావు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి-వేపాడ

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి అధికారులతో మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ సమీక్షా సమావేశం ఏర్పాటుచేశారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ సచివాలయ భవనాలు, రైతు భరోసా భవనాలు, వెల్నెస్ భవనాలు, అంగన్వాడీ భవనాలు, జగనన్న గృహాల పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, తహశీల్దార్ ప్రసన్నకుమార్, పిఆర్ జెఇ, అధికారులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇండియన్ బ్యాంకు వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం

ఇండియన్ బ్యాంకు 117వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని రామా స్కూలు ఆఫ్ ఎక్సలెన్సులో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. బ్యాంకు జోనల్ మేనేజర్ సిహెచ్ వెంకటరమణరావు, ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తమ బ్యాంకు సామాజిక బాధ్యతలో భాగంగా సుమారు 117 మొక్కలు పంపిణీ చేసి స్కూలు ఆవరణలో నాటారు. విద్యార్థులకు ప్లాంకులు, పెన్నులు పంపిణీ చేశారు. క్విజ్‌పోటీలు నిర్వహించి విజేతలకు ఎజిఎం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపుపట్ల అవగాహన కల్పించారు. తమ బ్యాంకు చేపట్టిన పిల్లల పొదుపు పథకాలు, భవిష్యత్తులో ఉన్నత విద్యాభ్యాసానికి అందించే విద్యా రుణాలు గురించి వివరించారు. స్థానిక బ్యాంకు మేనేజర్లు, పాఠశాల యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో పంచ ప్రాణ ప్రతిజ్ఞ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం పంచ ప్రాణ ప్రతిజ్ఞ కార్యక్రమం ప్రిన్సిపాల్ డాక్టర్ బలగ సుభ ఆధ్వర్యంలో నిర్వహించారు. రసాయనశాస్త్ర అధ్యాపకులు సత్యనారాయణ అందరితో ప్రతిజ్ఞ చేయించారు. చరిత్ర అధ్యాపకులు ఉమా మహేశ్వర రావు భారత దేశం, జాతీయ జెండా విశిష్టత లను విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మృతవీరుల దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మాల జాతి రిజర్వేషన్ల పరిరక్షణ కోసం ప్రాణాలు అర్పించిన వారి త్యాగాలను గుర్తు చేసుకోవాలని మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోగిశ రామకృష్ణ అన్నారు. శుక్రవారం చిన్న పల్లి వారి వీధిలోని జిల్లా మాల మహానాడు కార్యాలయం లో జరిగిన అమరుల దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని వారి చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వారి ఆశయ సాధనకు కృషిచేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పాడ. పైడితల్లి, జిల్లా ప్రధాన కార్యదర్శి చీడి రామకృష్ణ, జిల్లా కార్యదర్శులు దమరసింగి. ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై చర్యలకు సిఫార్సు

అభివృద్ధి కుంటుపడుతుందని స్వపక్ష, విపక్ష సభ్యుల నిరసన గళం

ప్రజాశక్తి-మెంటాడ

ఆలస్యంగా సర్వసభ్య సమావేశానికి వచ్చిన మండల అధికారుల హాజరు తీసుకోవద్దని, అటువంటి అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని తీర్మానం చేసి జిల్లా అధికారులకు సిఫార్సు చేయాలని ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు అన్నారు. శుక్రవారం ఎంపిపి అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపిడిఒ, తహశీల్దార్, ఎఒ 10.30గంటలకు హాజరయ్యారు. మిగతా అధికారులు హాజరు కాలేదు. 11గంటల వరకు వేచి చూశారు. అప్పటికి ఇంకో ఇద్దరు, ముగ్గురు అధికారులు మాత్రమే హాజరు కావడంతో ఎంపిపి ఆగ్రహం చెందారు. ఎన్నిసార్లు చెప్పినా అధికారుల పనితీరులో మార్పు కనబడలేదని అన్నారు. ఇంత జరిగినా ప్రగతి నివేదిక వినిపించిన వెంటనే కొందరు అధికారులు అక్కడ నుంచి వెళ్లిపోవడం గమనార్హం. వైద్యసేవలు సక్రమంగా అందడం లేదని, ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉండడం లేదని పలువురు సభ్యులు అన్నారు. పాముకాటుకు గురైన వ్యక్తిని ఆసుపత్రికి తీసుకెళ్తే చికిత్స చేయలేదని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అప్పలనాయుడు, కెవెల్ వలస సర్పంచ్ వరహాలమ్మ అన్నారు. ఎరువులు అందుబాటులో లేవని, ఈ క్రాప్ నమోదు పూర్తిస్థాయిలో జరగకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని పెద్దమేడపల్లి ఎంపిటిసి రెడ్డి ఎర్నాయుడు, కుంటినవలస సర్పంచ్ రమేష్ నాయుడు అన్నారు. నాడు-నేడు, అమ్మఒడి వంటి పథకాలు ఇచ్చినా డ్రాపౌట్స్ ఎందుకు పెరుగుతున్నాయని, ఒకే విద్యార్థితో స్కూళ్లు నడుస్తున్నాయని, ఇలా ఐతే కొన్నేళ్లకు ప్రభుత్వ స్కూల్లు మూతపడే పరిస్థితి ఏర్పడుతుందని వైసిపి మద్దతుదారుడు పిట్టాడ సర్పంచ్ పైడపు నాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని చోట్ల విద్యార్థులు ఎక్కువ వున్నా ఉపాధ్యాయులు కొరత వుందని కెవెల్ వలస ఎంపిటిసి ప్రవీణ్ అన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా నిర్మించిన ఇంటింటికీ కుళాయిలు ద్వారా నీరందడంలేదని, ట్యాంక్‌లు నిర్మించకుండా కుళాయిలు నిర్మించడం వలన ప్రయోజనం ఏమిటని వైస్ ఎంపిపి సారిక ఈశ్వర రావు అన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు

ఆర్‌బికెలతో విస్తృత సేవలు

ప్రజాశక్తి-గజపతినగరం

ఆర్‌బికెల ద్వారా రైతులకు విస్తృత సేవలు అందుతున్నాయని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సామంతుల పైడిరాజు అన్నారు. మండలంలో గజపతినగరం-2 ఆర్‌బికెలో శుక్రవారం మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఎడి కె.మహారాజన్ మాట్లాడుతూ ఇ-క్రాప్ నమోదు గురించి వివరించారు. పంట నమోదు తప్పనిసరిగా రైతులందరికీ చెయ్యాలన్నారు. అర్హత ఉన్న కౌలు రైతులకు కౌలు కార్డులను ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో ఎఒ ధనలక్ష్మి, తహశీల్దార్ ఎం.అరుణకుమారి, పశువైద్యులు వెంకటరమణ, శశిభూషన్, సుదర్శన్ పాల్గొన్నారు.

గంట్యాడ : ప్రతి పంటపైన రైతులకు అవగాహన కల్పించాలని ఎంపిపి పీరుబండి హైమావతి వ్యవసాయ శాఖ సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండల కార్యాలయంలో జరిగిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆమె మాట్లాడారు. రాయితీలపై వ్యక్తిగత పనిముట్లను రైతులకు అందించాలన్నారు. వరి పంటలో వచ్చే తెగుళ్లపై రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆర్.రామునాయుడు, జెడ్‌పిటిసి వి.నరసింహమూర్తి, వైసిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు జైహింద్‌కుమార్, వ్యవసాయ అధికారి పి.శ్యామ్‌కుమార్, పశువైద్యాధికారి సత్యనారాయణ, విద్యుత్ శాఖ అధికారి ప్రసన్న కుమార్, ఉద్యాన శాఖాధికారి అనిత తదితరులు పాల్గొన్నారు.

గంట్యాడ.. మాట్లాడుతున్న ఎంపిపి పి.హైమావతి

మెరకముడిదాం : ఆర్‌బికెల ద్వారా సకాలంలో ఎరువులు అందించాలని ఎఒ శ్రావణి తేజ తెలిపారు. శుక్రవారం నిర్వహించిన వ్యవసాయ సలహా మండలి మండల సమావేశంలో చైర్మన్ పప్పల కృష్ణమూర్తి మాట్లాడారు. ప్రతి రైతుకీ తప్పనిసరిగా ఇ-క్రాప్ నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో తాడ్డి వేణు, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్‌వి రమణరాజు, మాజీ జెడ్‌పిటిసి కోట్ల వెంకటరావు, వైస్ ఎంపిపి టి.హరిబాబు, డిటి గిరిధర్, తదితరులు పాల్గొన్నారు.

ఇ-పంట నమోదు సక్రమంగా నిర్వహించాలి

శృంగవరపుకోట : మండలంలో వరి పంట ఈ క్రాఫ్ నమోదును సక్రమంగా నిర్వహించాలని కొత్తవలస వ్యవసాయ సహాయ సంచాలకులు విజయ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని సంతగైరంపేటలో జరుగుతున్న ఇ-క్రాప్ నమోదు ప్రక్రియను మండల వ్యవసాయ అధికారి రవీంద్రతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ ఎఇఎలు ప్రతి సర్వే నంబర్‌లో ఉన్న పంటనూ అప్‌లోడ్ చేయాలన్నారు. దీనివల్ల రైతు పంటకు కనీస మద్దతు లభించడంతోపాటు ప్రకృతి వైపరీత్యాల వలన పంట నష్టం కలిగితే పరిహారం లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో విఐఎల్ రవిచంద్ర పాల్గొన్నారు.

విఎఎలకు పంటలపై శిక్షణ

నెల్లిమర్ల : గ్రామ వ్యవసాయ సహాయకులకు, విఆర్‌ఒలకు పంటల బీమా, పంట కోత ప్రయోగంపై శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఎడి ఎస్.కోటేశ్వరరావు శిక్షణ ఇచ్చారు. సిసిఇ యాప్, ఇ-పంట నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఎం.పూర్ణిమ, ఎస్ఒ విజయలక్ష్మి, ఎఇఒ నాగరాజు, హేమ మహేష్ పాల్గొన్నారు.

18కి లక్ష్మింపేట కేసు వాయిదా

ప్రజాశక్తి-వంగర

మండలంలోని లక్ష్మింపేట ఘటన కేసు ఈ నెల 18వ తేదికి వాయిదా పడింది. శ్రీకాకుళం కోర్టు జడ్జి.. లక్ష్మింపేట ప్రత్యేక న్యాయస్థానంలో శుక్రవారం విచారణ చేపట్టారు. 80 మంది నిందితులకు గాను 60 మంది హాజరయ్యారు. ఎనిమిది మంది గైర్హాజరయ్యారు. మిగతా 12 మంది మృతిచెందారు. ఈ కార్యక్రమంలో సిఐడి డిఎస్‌పి పాల్గొన్నారు. రాజాం రూరల్ సిఐ హెచ్.ఉపేంద్రరావు, వంగర ఎస్‌ఐ ఆర్.జనార్దన్ రావు బందోబస్తు నిర్వహించారు.

పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-వంగర

మండలంలోని అరసాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో పాఠ్యపుస్తకాల శ్రీకాకుళం మేనేజరు ఎన్.సతీష్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు సకాలంలో అందాయా? లేదా అని ఆరాతీశారు. అందరికీ అందాయని చెప్పడంతో సంతృప్తి వ్యక్తంచేశారు. ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జగదీశ్వరి, భుజంగరావు, సిఆర్‌పి మజ్జి గణపతి పాల్గొన్నారు.

ప్రిన్సిపల్‌కి ఘన వీడ్కోలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని తాటిపూడి వద్దనున్న బాలికల గురుకుల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ బదిలీ కావడంతో శుక్రవారం ఆయనకు అధ్యాపకులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఇప్పటికే ప్రిన్సిపల్‌గా బాధ్యతలు స్వీకరించిన సుభాషిణికి పుష్పగుచ్ఛం అందించి ఆహ్వానం పలికారు. రాజేంద్రప్రసాద్ నర్సీపట్నం గురుకులానికి బదిలీపై వెళ్లారు.

14న బైక్ వేలం

వంగర : మద్యం కేసులో పట్టుబడిన సిబిజెడ్ వాహనాన్ని రాజాం ఎస్‌ఇబి కార్యాలయంలో ఈ నెల 14న వేలం వేస్తున్నట్లు వంగర ఎస్‌ఐ ఆర్.జనార్దనరావు తెలిపారు.

గ్రామాల్లో నా భూమి-నా దేశం

వేపాడ : మండలంలోని ఒబులయ్యపాలెం, కొంపల్లి, కృష్ణరాయుడుపేట గ్రామాల్లో నాభూమి-నాదేశం కార్యక్రమం నిర్వహించారు. అమరవీరులను స్మరించుకుంటూ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాల్లో మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ, ఎంపిపి దొగ్గ సత్యవంతుడు, ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, తహశీల్దార్ ప్రసన్న కుమార్, జెఇ దేముడు, ఎపిఒ ఆదిలక్ష్మి, సర్పంచులు ఎన్.అరుణ, సిహెచ్.ముసలినాయుడు, సచివాలయ కన్వీనర్లు బి.శ్రీను, ఎన్.శ్రీను, ఎ.పైడిబాబు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస : దేవాడ పంచాయతీలో నా భూమి- నా దేశం కార్యక్రమాన్ని ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ చేపట్టారు. అనంతరం సచివాలయ ఆవరణలో మొక్కల్ని నాటారు. కార్యక్రమంలో రాష్ట్ర కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ, తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: నగర పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో చైర్ పర్సన్ బంగారు సరోజినీ, కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, మేనేజర్ టివిఎస్ విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : దేశాన్ని ప్రేమించడం, ప్రకృతిని పరిరక్షించడం యువత అలవర్చుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు అన్నారు. ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా మేరా మట్టి- మేరా దేశ్ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. కళాశాలలో జామ, నేరేడు, టేకు మొక్కలను నాటారు. ఎన్ఎస్ఎస్ పిఒ బి.సంధ్యారాణి, అధ్యాపకులు సిహెచ్ .శ్రీనివాసరావు, సిబ్బంది రాజు పాల్గొన్నారు.

గుషిణి సర్పంచ్ అకాల మరణం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

గుషిణి సర్పంచ్ జమ్ము సన్యాసమ్మ (65) శుక్రవారం అకాల మరణం పొందారు. గుండెపోటుతో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. బుధవారం సర్పంచ్ సన్యాసమ్మకు గుండెపోటు రావడంతో విజయనగరంలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో విశాఖపట్నంలోని అపోలో ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం తెల్లవారు జామున తుది శ్వాసవిడిచారు. సర్పంచ్ బాధ్యతలు చేపట్టిన సన్యాసమ్మ గ్రామాభివృద్ధికి ప్రాధాన్యమిచ్చారు. రూ.50 లక్షల విలువైన సొంత స్థలాన్ని గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రానికి దానమిచ్చి ఉదార స్వభావం చాటుకున్నారు. సన్యాసమ్మ హయాంలోనే పంచాయతీలో సిసి రోడ్లు, కాలువలు నిర్మించారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆమె భౌతికకాయాన్ని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సందర్శించి, నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో డిసిసిబి వైస్ చైర్మన్ చనమల్ల వెంకట, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు అంబళ్ల శ్రీరాములునాయుడు, జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపిపిలు సారికి వైకుంఠం, పతివాడ సత్యనారాయణ, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, తదితరులున్నారు.

గుషిణి సర్పంచ్ జమ్ము సన్యాసమ్మ

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ సిఐ వి.వెంకటరావు సూచించారు. శుక్రవారం భాష్యం స్కూలులో విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వలన విచక్షణ కోల్పోయి, నేరస్తులుగా మారి చాలామంది విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారని అన్నారు. కావున, మత్తు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని, వాటిని సాధించేందుకు కృషి చేయాలన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, రహదారి భద్రత పట్ల అవగాహన ఉండాలని సూచించారు. దిశా యాప్ ను విద్యార్థినులు తప్పనిసరిగా తమ మొబైల్స్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఆపద సమయంలో యాప్ వినియోగించి, రక్షణ పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ భాస్కరరావు, భాష్యం స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.20.12 లక్షలు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

రామతీర్థం రామస్వామి దేవస్థాన హుండీ ఆదాయం రూ.20,12,436 వచ్చింది. శుక్రవారం దేవస్థానం ఆవరణలో హుండీలు తెరిచి లెక్కించారు. మే నెల నుంచి వచ్చిన ఆదాయమిది. లెక్కింపును ఇఒ ఎం.ప్రసాదరావు పర్యవేక్షించారు. ట్రస్ట్ బోర్డ్ మెంబర్ దాట్ల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

19న కొత్తవలసలో అన్న కేంటీన్ ప్రారంభం

అన్న కేంటీన్ వాహనం వద్ద టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ, నాయకులు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఈ నెల 19న కొత్తవలస మండల కేంద్రంలో అన్న కేంటీన్, టిడిపి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ తెలిపారు. శుక్రవారం శృంగవరపుకోట పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద ఆయన మాట్లాడారు. శృంగవరపుకోట నుండి సుమారు 300 మందికి సరిపడే భోజనాన్ని తయారుచేసి, ప్రతిరోజూ ప్రత్యేక వాహనంపై కొత్తవలస తీసుకొచ్చి, అన్న కేంటీన్‌లో పేదలకు పంపిణీ చేస్తామని తెలిపారు. పోటీ పరీక్షల కోసం గొంప కృష్ణ విద్యాసంకల్పం పేరుతో ఇటీవల నిర్వహించిన పరీక్షల 'కీ'ని ఆన్‌లైన్‌లో ఉంచినట్లు చెప్పారు. త్వరలో ఫలితాలను ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి కొత్తవలస మండల అధ్యక్షులు గొరపల్లి రాము, విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షులు రాయవరపు చంద్రశేఖర్, మండల కార్యదర్శి రామసత్యం, ఎస్.కోట పట్టణ ఉపాధ్యక్షులు మాదిబోయిన మంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్‌పి దీపిక

పోలీసు సంక్షేమ దివస్

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాపోలీసు కార్యాలయంలో శుక్రవారం ఎస్‌పి ఎం.దీపిక పోలీసు సంక్షేమ దివస్ నిర్వహించారు. సిబ్బంది నుంచి వినతులు స్వీకరించి, వారి వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

అధికారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి గోవిందరావు

అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి

ప్రజాశక్తి-రామభద్రపురం

అధికారులంతా సమన్వయంతో పనులు చేసి ఆయా శాఖల వారు చేసిన కార్యక్రమాలను రికార్డు చేసి ఫొటోలను జిల్లా, రాష్ట్ర కార్యాలయాలకు అప్‌లోడ్ చేయాలని మండల ప్రత్యేకాధికారి గోవిందరావు ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ రమామణి ఆధ్వర్యంలో కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. హౌసింగ్ డే సందర్భంగా గృహనిర్మాణ ప్రగతిని సమీక్షించారు. ఐసిడిఎస్, నాడు-నేడు, రైతు భరోసాలపై అధికారులతో సమీక్షించారు. తొలుత స్థానిక మండల కేంద్రంలో వేసిన లేఅవుట్‌ను ఎఇ సింహాచలంతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి వెంకటయ్య, ఎంఇఒ రేగాన పెంటయ్య, పిఆర్ ఎఇ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ ప్రమాణాలతో 'విక్టరీ'లో విద్యాబోధన

18 ఏళ్లుగా టెన్త్‌లో వందశాతం ఉత్తీర్ణత ● నవోదయ, గురుకుల ప్రవేశాల్లో సత్తాచాటుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి-వేపాడ

వేపాడ మండల కేంద్రంలో శ్రీ విక్టరీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలను తొలుత 1989లో విక్టరీ ట్యుటోరియల్‌గా ప్రారంభించారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు ట్యూషన్ చెప్పేవారు. 1993లో కాన్వెంట్‌గా రూపాంతరం చెందింది. 1995లో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు పాఠశాల నిర్వహిస్తూ రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందింది. 1998లో ఆరో తరగతి నుండి పదో తరగతి వరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి గుర్తింపు పొంది, వేపాడ మండలంలో విద్యార్థులకు అత్యుత్తమ విద్యనందిస్తోంది.

శ్రీవిక్టరీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల

ఎన్నో విజయాలు

విక్టరీ పాఠశాలను స్థాపించిన నాటి నుంచి విద్యార్థులు సత్తాచాటుతున్నారు. ఐదో తరగతి, ఎనిమిదో తరగతి రెసిడెన్షియల్ ప్రవేశాలలో 80 శాతం వరకు బొబ్బిలి, తాటిపూడి, నెల్లిమర్ల, సింహాచలం వంటి గురుకులాల్లో విక్టరీ పాఠశాల విద్యార్థులు సీట్లు పొందారు. 15 సంవత్సరాల నుండి 30 నుంచి 40 మంది విద్యార్థులకు నవోదయ శిక్షణ ఇవ్వగా, ప్రతి ఏటా 5 నుంచి 8 మంది విద్యార్థులు సీట్లు సాధించారు. నేటికి 18 ఏళ్ల నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించడం విక్టరీ పాఠశాల ప్రత్యేకతగా చెప్పొచ్చు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మండల స్థాయిలో విక్టరీ విద్యార్థులు మొదటి మూడు స్థానాలను కైవశం చేసుకుంటున్నారు. జిల్లా స్థాయిలో కూడా ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించారు. ఏటా పాలిటెక్నిక్ ఎంట్రన్స్‌లో ఇక్కడి విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తూ వస్తున్నారు. 2015-16, 2017-18 సంవత్సరాల్లో ట్రిపుల్ ఐటి సీట్లు సాధించారు.

2014-15, 2015-16 కాలంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా విక్టరీ పాఠశాల విద్యార్థులు ప్రతిభా పురస్కారాలు పొందారు. 2021-22 నుంచి నూతన యాజమాన్యం రన్ బై మాస్టర్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ - గుంటూరు వారి సారధ్యంలో ఉన్నత విద్యా ప్రమాణాలను గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అందిస్తోంది. రన్ బై మాస్టర్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటే, యోగా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మరోవైపు విద్యార్థుల మేధాశక్తిని పెంపొందించేందుకు మ్యాథ్స్, అబాకస్, డ్రాయింగ్, స్పెల్-బి వంటి అధునాతనమైన విద్యా ప్రమాణాలను కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా విద్యార్థులకు అందిస్తోంది విక్టరీ పాఠశాల. అందుకే విద్యార్థుల తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను విక్టరీ పాఠశాలలో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ ప్రమాణాలతో విద్యనందిస్తోంది.. శ్రీ విక్టరీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల. నాణ్యమైన విద్యనందించడమే మూలంగా పాఠశాల స్థాపించిన నాటి నుంచి నేటివరకు అప్రతిహతంగా సాగుతోంది. 18 ఏళ్లపాటు పదోతరగతిలో శతశాతం ఫలితాలు సాధించడమే విక్టరీ పాఠశాలలో విద్యాబోధనకు నిదర్శనంగా చెప్పొచ్చు. నవోదయ, రెసిడెన్షియల్ వంటి పోటీ పరీక్షల్లో ఏటా సీట్లు సంపాదిస్తూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తోంది విక్టరీ పాఠశాల యాజమాన్యం.

నేరాలు ఘోరాలు

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- నెల్లిమర్ల

మద్యానికి బానిసై ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం కొండగుంపాంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కొండగుంపాం గ్రామానికి చెందిన గరుగుబిల్లి పాపారావు (45) తాపీ పనుల చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసై ఏరోజు వచ్చిన కూలి ఆ రోజే ఖర్చు చేసి ఇంటికి ఇచ్చేవారు కాదు. ఈ నేపథ్యంలో భార్య విసుగుచెంది పుట్టింటికి వెళ్లిపోయింది. మద్యానికి బానిసైన పాపారావు తన స్వగృహంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు.

మోసం కేసుల్లో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి-విజయనగరం

బంగార నగులు తయారు చేసే విషయంలో పలువురిని మోసగించిన కేసులు నగరంలోని ఎన్‌ఎంకె జ్యూయలరీ షాపు యజమానులు నాగులకొండ వెంకట కిషోర్, నాగులకొండ వెంకట శ్రీపానిలను శుక్రవారం అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐలు భాస్కరరావు, అశోక్ కుమార్ తెలిపారు. నిందితులు కొద్దిమంది వ్యక్తుల నుండి బంగారు వస్తువు చేసేందుకు గాను బంగారం, పాత బంగారు వస్తువులు తీసుకొని, తిరిగి కొత్త వస్తువులు తిరిగి ఇవ్వకపోవడంతో వన్ టౌన్ పోలీసు స్టేషనులో బాధితులు ఫిర్యాదు చేశారు. దీంతో రెండు చీటింగ్ కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామన్నారు. ఈ కేసుల్లో ప్రధాన ముద్దాయిలు అయిన ఇద్దరిని అరెస్టు చేసి, రిమాండుకు తరలించామని తెలిపారు. ఇటువంటి మోసాలు జరుగున్నందున ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని, వ్యక్తుల గత చరిత్ర పరిశీలించి విలువైన వస్తువులు ఇవ్వాలని తెలిపారు.